శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోం

● సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్



సైదాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు భం గం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసు కుంటామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ కె. రాఘవేందర్ తెలి పారు. దొంగతనాలు, సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ రవాణాను నియంత్రించేందుకు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ పర్యవేక్షణలో గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఠాణా పరి ధిలో తీసుకుంటున్న భద్రతా చర్యలపై 'ఆంధ్రజ్యోతి'కి ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

సైబర్ నేరం జరిగితే ఏం చేయాలి?

సైబర్ నేరగాళ్లు రకరకాల ఆఫర్ల పేరుతో ప్రజలకు వల విసిరి మోసా లకు పాల్పడుతున్నారు. అపరిచితుల నుంచి వచ్చి న సెల్‌ఫోన్ కు వచ్చే మెసేజ్‌లను, ఈ-మెయిల్ లింకులను ఓపెన్ చేయడం, ఓటీ పీలు చెప్పడం వంటివి చేయరాదు. అలా చేస్తే మీ బ్యాంక్‌లోని డబ్బులను దోచేస్తారు. సైబర్ నేరం జరిగితే టోల్‌ఫ్రీ నంబరు 1930కి వెంటనే కాల్ చేసి చెప్పాలి.

గంజాయి రవాణాను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గంజాయి రవాణాను అరికట్టేందుకు సైదాబాద్ ఠాణా పరిధిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశాం. గంజాయిని నియంత్రించడంలో పోలీసు లకు ప్రజలు సహకరించాలి. గంజాయి రవాణా చేస్తున్నట్టు సమా చారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం,

సింగరేణి కాలనీలో దారి దోపిడీలు నివారణకు తీసుకున్న చర్య లేమిటి?

సింగరేణి కాలనీ గుడిసెల ప్రాంతాలలో ఈ మధ్య కాలంలో రాత్రివేళల్లో కొన్ని ఘటనలు జరిగిన మాట వాస్తవామే. వెంటనే నిందితులను గుర్తించి రిమాండ్‌కు తరలించాం, ఇలాంటి ఘట నలు పునరావృ తంగా కాకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశాం.

బస్తీల్లో మద్యం బెల్ట్ షాపులను నియంత్రించలేరా ?

బెల్ట్ షాపులపై ఎప్పటికప్పుడు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం, ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తుంటే స్థానికులు వెంటనే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తే మరింతగా కట్టడి చేసే అవకాశం ఉంది.

ఇంద్రప్రస్థ కాలనీ ఫేజ్-2 అధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి



నూతన అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు

చంపాపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హస్తినా పురం డివిజన్‌లోని ఫేజ్-2 కాలనీ సంక్షేమ సంఘం అధ్య క్షుడిగా శేఖర్‌రెడ్డిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిగా సత్త య్యా జాయింట్ సెక్రటరీగా రాహుల్, ఆర్గనైజింగ్ సెక్ర టరీగా చంద్రమోహన్, కోశాధికారిగా అంజన్‌రెడ్డిను ఎన్నుకున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని కొత్త అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి తెలిపారు.

రహదారి మధ్యలో ఉన్న వృక్షం తొలగింపు



చెట్టు తొలగించిన ప్రదేశం

చంపాపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివి జన్ మందమల్లమ్మ చౌరస్తా సమీపంలో విశ్వాస్ ఆసుపత్రి ముందు యూటర్న్ వద్ద ప్రమా దకరంగా ఉన్న చెట్టును ఆది వారం జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈ నెల 18న ఆంధ్రజ్యోతిలో 'రహదారి మధ్యలో వృక్షం...ప్రమాదకరంగా యూటర్న్' అనే శీర్షికన ప్రచు రించిన వార్తకు అధికారులు ఆదివారం స్పందించారు. వృక్షాన్ని తొలగిం చడంతో విశ్వాస్ ఆసుపత్రి వైపు యూటర్న్ తీసుకొనేందుకు ఇబ్బందులు తొలగడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్నప్రసాద వితరణను అయ్యప్ప స్వాములు

సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని ప్రసిద్ధ షిర్డీ సాయిబాబా సంస్థాన్ అన్నప్రసాద కేంద్రం లో మణికంఠ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న ప్రసాద విత రణ కార్యక్రమాన్ని అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కె.బసవయ్య గురు స్వామి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ, ఎంతో పవిత్రంగా నలభై రోజులు చేపడుతున్న అన్నప్రసాద కార్యక్రమంలో మాలధారణ స్వాములు భాగస్వాములు కావాలని అన్నారు. నిట్టు కృష్ణ గురుస్వామి, కృష్ణ యాదవ్, సీహెచ్ జానకీరామ్ గురుస్వామి, శంకర్‌రావు గురుస్వామి, భీమయ్య గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఏర్పాటు ప్రకటనపై హర్షం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయిలో గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనపై గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేం దర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కుంట్లూర్‌లోని గాంధేయన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర కమిటీ సమా వేశం జరిగింది. సమావేశంలో డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడు తూ, గాంధీ ఆలోచన విధానాన్ని ప్రతిబింబించేలా విగ్రహాన్ని నిర్మిస్తానని ముఖ్యమంత్రి చెప్పడం గర్వించదగ్గ విషయం అన్నారు. కాగా, ధన్యవాద తీర్మానం పేరుతో ఈ నెల 29న రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లోని గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలు పాలని ఆయన పిలుపునిచ్చారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మెరుగు మధు, గిరిధర్, మదన్మోహన్, సంజయ్‌రెడ్డి, రాంబాబు, పావని, మదన్, చైతన్యరెడ్డి, రామకృష్ణారెడ్డి, సతీష్, సాయి పాల్గొన్నారు.

ఓబీసీ ఉద్యోగులకు అన్నిరంగాల్లోనూ అన్యాయం

● మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ ఉద్యోగులకు ప్రమో షన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఓబీసీలకు అన్నిరంగాల్లో అన్యాయం జరుగుతుందని, జాతీయస్థాయిలో బలమైన ఉద్యమం చేపట్టి కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని ఆయన హెచ్చరించారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆలిండియా బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశా నికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్.కృష్ణయ్య మాట్లా డుతూ, జాతీయ ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ భద్రత కల్పించాలని, క్రిమి లేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం లో అసోసియేషన్ సర్కిల్ ప్రెసిడెంట్ కె.అనిల్‌కుమార్, ప్రధా న కార్య దర్శి ఎస్.శివకుమార్, నాయకులు ధర్మరాజ్, విజయ్‌కుమార్, శివకృష్ణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన ర్యాలీ

సైదాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 9వ ఆయుర్వేద దినోత్సవ సందర్భంగా గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్ఐఐఎంహెచ్) ఆధ్వర్యంలో 'ఆయుర్వేద ఇన్నోవే షన్ ఫర్ గ్లోబల్ హెల్త్' అనే నినాదంతో ఆదివారం రైడర్స్ ర్యాలీ నిర్వ హించారు. ఉదయం 7.30 గంటలకు సంస్థ కార్యాలయం వద్ద అసి స్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జేపీ ప్రసాద్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయుర్వేద ప్రచారం, అవగాహన కోసం ఆయూష్ మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా అన్ని నగరాల్లో ర్యాలీలు నిర్వహించినట్టు తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న వారికి సంస్థ తరఫున సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పగలు పందులు.. రాత్రుళ్లు తాగుబోతులు

- రంగనాయకుల గుట్ట బస్తీ దవాఖానా నిర్వహణ అధ్వానం
- పట్టించుకొని జీహెచ్‌ఎంసీ అధికారులు
- ఆస్పత్రికి వచ్చేందుకు జంకుతున్న జనం



రంగనాయకుల గుట్ట కాలనీలోని బస్తీ దవాఖానా

హయత్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ లోని రంగనాయకుల గుట్ట కాలనీలో బస్తీ దవాఖానాకు సుస్తీ చేసింది. అపరిశుభ్ర పరిసరాలతో ఆస్పత్రి కంపుకొడుతోంది. ఫలితంగా ముక్కు, మూతికి మాస్కు లేకుండా ఉండలేని పరిస్థితి దాపురించింది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదని స్థాని కులు, వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోగం నయం కావాలని ఆస్పత్రికి వస్తే లేని రోగాలు వచ్చేలా ఇక్కడ పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వేళల్లో పందులు, కుక్కల సంచారం, రాత్రి వేళల్లో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయి. ఆస్పత్రి ప్రహరీకి ఉన్న రెండు గేట్లకు తాళాలు వేయకపోవడంతో పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారాయి. స్థానికులు కొందరు తమ ఇళ్లలోని చెత్తను తెచ్చి వేయడంతో పాటు చిన్నారులతో మలమూత్ర విసర్జన చేయిస్తుండటంతో దవాఖానా పరిసరాలు కంపు కొడుతున్నాయి. బయటి వ్యక్తులు కొందరు తమ ఇళ్లలో నిరుపయోగ వస్తువులను తీసుకువచ్చి ఆస్పత్రి ఆవరణలో పెడుతున్నారు, ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే గొడవకు దిగుతున్నారు. తాగుబోతులు మద్యం తాగి సీసాలను ఇక్కడే వదిలి వెళ్తున్నారు. వాటిని ఆస్పత్రి సిబ్బంది ఉదయం వచ్చి శుభ్రం చేసుకుంటున్నారు.

చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన నీటి సంపు



చెత్త, వ్యర్థాలతో నిండి ఉన్న నీటి సంపు

రంగనాయకుల గుట్ట బస్తీ దవాఖా నాలోని నీటి సంపు రాళ్లు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి ఉంది. సంపులోకి అప్పుడప్పుడు వచ్చే కొద్దిపాటి నీటినే బాత్ రూమ్‌లకు వెళ్లే రోగులు, ఆస్పత్రి సిబ్బంది తప్పనిసరి పరిస్థితిలో వినియోగిస్తున్నారు. ఆ నీటిని వాడటం వల్ల చర్మ వ్యాధులు వస్తున్నాయని పలువురు తెలిపారు. సంపును శుభ్రం చేయించాలని అధికారులకు, నాయకులకు మొర పెట్టు కున్నా పట్టించుకోవడం లేదని పలువురు తెలిపారు.

నీటి సౌకర్యం లేని మరుగుదొడ్లు



ఆసుపత్రి ఆవరణలోని మరుగుదొడ్లు

రంగనాయకుల గుట్ట బస్తీ దవాఖానాలో వాయువ్య మూలన జీహె చ్ఎంసీ అధికారులు మరుగుదొడ్లు ఏర్పాటు చేశా రు. ప్రారంభంలో నీటి సౌకర్యం కల్పించా రు.. ఆ తర్వాత దానిని ఎవరు పట్టించుకోక పోవడంతో పైపులు, నల్లాలు, జీర్‌లు దొంగలు ఎత్తుకెళ్లారు. నీరు లేకుండా ఉప యోగి స్తుండటంతో బస్తీ ఆస్పత్రి పరిసరాలలో కంపు వెదజలుతోంది.

ఆస్పత్రి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



తాళం వేకుండా వదిలేసిన ప్రహరీ గేటు

రంగనాయకుల గుట్ట బస్తీ దవాఖానా పరి సరాలను పరిరక్షించేందుకు ఆస్పత్రి చుట్టూ ఆరు ఫీట్ల ఎత్తులో ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గేట్లకు తాళాలు వేయాలని స్థానికులు కోరుతున్నారు. దవాఖానా పరిసరాల్లో మొక్కలు నాటాలని, స్థానికంగా బోరు వేసి నీటి వసతి కల్పించాలని పలువురు కోరుతు న్నారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లు బస్తీ దవాఖానాను సందర్శించి పరిసరాల పరిశుభ్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం కుంట్లూ ర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఏఐటీ యూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర హరిసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి పాల్గొన్నారు. దేశంలోనే మొట్టమొదటగా ఏర్ప డిన కార్మిక సంఘం ఏఐటీయూసీ అని. ఈ నెల 31న నిర్వహించే సంస్థ ఆవిర్భావ దినోత్స వంలో కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పా ల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.సీపీఐ రాష్ట్రకౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, పర్వతాలు, ప్రసాద్, నరసింహ, రా ములు, సాయిలు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై తీర్పును ప్రభుత్వాలు పునః పరిశీలించాలి

మలక్‌పేట మాల సంఘం డిమాండ్

చాదర్‌ఘాట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునః పరిశీలన చేయాలని మలక్‌పేట మాల సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం ముసారాంబాగ్‌లోని బాల మ్మ దానమ్మ బస్తీల మలక్‌పేట మాల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి సంఘం వ్య వస్థాపక అధ్యక్షుడు ముప్పిడి బల్వంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును మాల సంఘం వ్యతిరేకిస్తున్నదని ఆయన అన్నారు. అన్ని న్యాయస్థానాల్లో ఎస్సీ, ఎస్టీ జడ్జీలను నియమిం చాలని, కొలీజియం విధానాన్ని రద్దు చేసి ఇండి యన్ జ్యూడీషియల్ సిస్టమ్ పరీక్ష నిర్వహిం చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వా లు వర్గీకరణ చేస్తే ఒప్పుకో బోమని, పార్లమెంట్ ద్వారా చట్టం చేస్తే అంగీ కరిస్తామన్నారు. సం ఘం అధ్యక్షుడు పి.నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు నీరుడు శ్రీకాంత్,కార్యదర్శి బి.బల్వంత్‌రావు, ప్రధా న కార్యదర్శి ఏఎన్ రంగరాజ్ పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సదర్ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మహేందర్ యాదవ్

సదర్ మేళాకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానం

సైదాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నవంబరు 1వ తేదీన సైదాబాద్‌లో నిర్వహించే సదర్ మేళాకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఉత్సవ నిర్వాహకులు కోరారు. మహా సభ గ్రేటర్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాద వ్ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రిని కలిసి ఉత్సవా ల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాల్లో తప్ప ని సరిగా పాల్గొంటానని మంత్రి హామీ ఇచ్చారని మహేందర్ యాదవ్ తెలిపారు. శ్రీశైలం యాదవ్, సుధాకర్ యాదవ్, గడ్డం కృష్ణ యాదవ్, సంతోష్ యాదవ్, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ధి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



లబ్ధిదారు భర్తకు సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతున్నదని ఎల్‌బీన గర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ కాస్‌బా గ్‌కు చెందిన నాగరాజు భార్య శ్రీలత గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతోంది. వారి ఆర్థిక పరిస్థితి బాగలేకపోవడంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించి పరి స్థితిని వివరించారు. ఆయన సిఫార్సుతో శ్రీలత శస్త్రచికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయగా, రూ. 2,50,000లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీని ఆదివారం శ్రీలత భర్త నాగరాజుకు ఎమ్మెల్యే అందజేశారు.

3 వేల మందికి ఉచిత వైద్య పరీక్షలు

చాదర్‌ఘాట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత యునానీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ రకాల నొప్పులు, రోగాలతో బాధ పడుతున్న దాదాపు 3 వేల మంది మహిళలు, పురుషులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆల్ ఇండియా యునానీ టిబ్బీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరి గిన ఈ ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని చావునీ డివిజన్ కార్పొరేటర్ ఎంఎ సలాం షాహిద్ ప్రారంభించారు. దాదాపు 120 మంది వైద్యులు కిడ్నీ, థైరాయిడ్, బీపీ, షుగర్, ఆస్తమా, కీళ్ల నొప్పులతో బాధ పడుతున్న రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రహరీని కూల్చిన వారిపై చర్యలు తీసుకోండి

మన్సూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ ప్రాథమిక పాఠశాల స్థలంలో ఏర్పాటు చేసిన ప్రహరీని కూల్చివేసిన వారిపై తగిన చర్యలు చేపట్టాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్‌ని బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు వారు కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సభ్యు లు మాట్లాడుతూ, ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం బండ్లగూడలోని సర్వేనంబర్ 36/6లో గల ఎకరం ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే అందులో పాఠశాల నిర్మాణం చేపట్టారన్నారు. సదరు స్థలం తమదంటూ కొందరు వ్యక్తులు వచ్చి ప్రహరీని కూల్చారని, అధి కారులతో మాట్లాడి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల భవిష్య త్తును దృష్టిలో పెట్టుకుని ఆ స్థలాన్ని ప్రభుత్వ పాఠశాలకే కేటాయించేలా చొర వ చూపాలని కోరారు. తమ వినతికి కార్పొరేటర్ అరుణ సానుకూలంగా స్పం దించినట్లు వారు తెలిపారు. సభ్యులు మెట్టు రవీందర్ గౌడ్, గడ్డం రామారావు గౌడ్, చెరుకు భవానీ శంకర్‌గౌడ్, సహదేవ్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, గౌతమ్, పాండు తదితరులు ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి

పోత లింగన్న స్వామి ఉత్సవాలు

చాదర్‌ఘాట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్‌లోని బొడ్రాయి పోత లింగన్న స్వామి ఐదవ వార్షికోత్సవాలను బస్తీ వాసులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్తీవాసులు వీరేశం, యాద గిరి సురేందర్, నర్సింహ, అజయ్ ప్రకాష్, నరహరి, ముప్పిడి బల్వంత్, ధన్‌రాజ్, పవ్వికు మార్, భరత్, హరీష్, సంతోష్ పాల్గొన్నారు.

మూడేళ్ల పాపను కిడ్నాప్ చేసిన యువకుడు

● అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్న పోలీసులు

మదీన, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల పాపను కిడ్నాప్ చేసిన యువకుడిని బండ్లగూడ పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. అతడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి నట్లు ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపారు. అల్ జుబేల్ కాలనీకి చెందిన సాజిదాబేగం కుమార్తె ఫాతిమా(3) ఆదివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే ప్రాంతా నికి చెందిన సోహైల్(25) తీసుకొని వెళ్లిపో యాడు. కొద్దిసేపటి తర్వాత పాప కనిపించక పోవడంతో తల్లి, కుటుంబసభ్యులు పరిసా రాల్లో వెతుకుతున్నారు. అదే సమయంలో కొద్ది దూరంలో సోహైల్ ఆ పాపను తీసుకుని నడు చుకుంటూ వెళ్తున్నాడు. ఇది గమనించిన వారు అతడి చేతి నుంచి పాపను తీసుకున్నా రు. సమాచారమందుకన్న బండ్లగూడ పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా యువకుడు మాత్రం పాపను వాళ్ల కుటుంబ సభ్యులకు అప్పగించడానికి వారి ఇంటికి తీసు కెళ్తున్నానని, కిడ్నాప్ కాదని చెబుతున్నాడు. పాప కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించిన అనంతరం ఆ యువ కుడు కావాలనే పాపను కిడ్నాప్ చేశాడా? లేక కుటుంబసభ్యులకు అప్పగించడానికి తీసుకెళ్త న్నాడా? అతడి ఉద్దేశం ఏమై ఉంటుంది అనేది నిర్ధారణ అవుతుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి

● తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్

హయత్‌నగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. మాజీ సీఎం కేసీఆర్‌లా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పవద్దని సూచించారు. యూటీఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి అధ్యక్షతన ఆదివారం తుర్కయంజాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందాళ బల్‌దేవ్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ఆస్తులు, ప్రాణాలు పోగొట్టుకున్న ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకో వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఉచిత బస్ పాస్, పెన్షన్ సౌకర్యాలను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీ ల అమలుపై దీపావళిలోగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగే విష్ణు వర్ధన్, కారింగుల నరేందర్, దుగ్గాని శ్యామల, బచ్చిగళ్ల రమేష్, నక్క జంగయ్య, వీరస్వామిగౌడ్, దాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రూ. కోటి విలువైన రోడ్డు, యూజీడీ పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీరాజు, సంపూర్ణరెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ 21వ వార్డులో కోటి రూపాయలతో చేపట్టనున్న సీసీ, యూజీడీ పనులు మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీరాజు ప్రారం భించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ ఓరుగంటి సుజాతకిషన్‌గౌడ్‌తో కలిసి ఆమె పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కొత్తగా ఏర్పాటవుతున్న కాలనీలో మౌలిక వసతుల కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కౌన్సిలర్లు గీతా శ్రీరాములు, హరిశంకర్‌ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ పెద్దఅంబర్‌పేట్ అధ్యక్షుడు ఓరుగంటి కొండల్‌గౌడ్, సయ్యద్, కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం రాలేదని వ్యక్తి అదృశ్యం



రవి

హయత్‌నగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగం రాకపోవ డంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం... పెద్దఅంబర్‌పేట్‌లోని మలేష్ కాలనీకి చెందిన మొలుగురి రవి(35) కొంత కాలంగా ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇటీవల డీఎస్సీలో అర్హత సాధించినా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈనేపథ్యంలో ఈ నెల 26న ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకి వెళ్లి తిరిగి రాలేదు. భార్య నర్మద అతడి కోసం గాలించినా ఆచూకీ లభించకపో వడంతో ఆదివారం ఆమె హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.